

# భయం

## నక్సలైట్ కథలు

**సి. హెచ్. మధు**

## 'గొల్లపల్లి'లో కనకయ్యకు పాలు పోవటం లేదు.

రాత్రి తొమ్మిది దాటింది.
రెండు మెతుకులు నోట్లో వేసుకొని
'భోజనం' చాలని లేచాడు.
ఆయనకు ఏమీ అర్థం కావటం లేదు.
చర్చల సారాంశం తెలియటం లేదు.
ఏమవుతుందో, ఎటుపోయి ఎటు తిరుగుతుందోనని
భయంగా వుంది.
గుడ్డి దీపం వెలుగులో భార్యను పిల్చి అన్నాడు
"ఎందుకైనా మంచిది. ఒక సంచిలో కొన్ని అటుకులు, బట్టలు వేసి వుంచు".
భార్యకు అర్థమయ్యింది-
చర్చలు ఫెయిలయితే వూరు విడిచి పారిపోవటానికి సన్నాహాలు.

కనకయ్య భార్యకు తెల్సు. తన భర్తకు అన్నలతో ఏ సంబంధం లేదని- పోలీసు ఇన్‌ఫార్మర్ కాదని. అయినా దెబ్బ దెబ్బే ఎటునుండి తగిలినా తగులొచ్చు ఆ వూరూ అలాంటిది.

గొల్లపల్లి చిన్న వూరు. వంద దాటని కడప. మూడు వందలు దాటని జనాభా. కరెంట్ తీగెలింకా రాలేదు, రోడ్డు లేదు, ఫోన్ లేదు, టి.వి. లేదు. చిన్న బడి వున్నా లేనట్టే లెక్కా. ఎప్పటికీ తాళమే. ఆసుపత్రి ఛాయలు కూడా ఆ వూరులో లేవు. ఆధునిక యుగంలో స్వాతంత్ర్య భారతదేశంలో ఇటువంటి వూరు వుందంటే ఎవరూ నమ్మరు.

"ఇటువంటి వూళ్ళు వున్నాయి కనుకే నక్సలైట్లున్నారు. నక్సలైట్లు వున్నందునే ఇటువంటి వూళ్ళు అభివృద్ధి చేయలేకపోయామని" ప్రభుత్వం అంటుంది. "ఇటువంటి వూళ్ళు వున్నాయి కనుకే మేమున్నాం ఆయుధాలు ధరించాం" అని నక్సలైట్లు అంటారు. ఈ చర్చ మనకెందుకూ ఈ కథలో 'చర్చ' ఎందుకూ? చర్చించేవారికి విడిచిపెడుదాం!

గొల్లపల్లి చుట్టూ గుట్టలు. గుట్టలే కాదు. దట్టమైన అడవి వుంది. ఆ వూరు నక్సలైట్ల ప్రాంతమని పోలీసులంటుంటారు. కానీ ఆ మాటను ప్రజలు అంగీకరించరు. అయితే ఒకటి నిజం. అడవికి దగ్గరగా వున్నందున ఆ వూరుకు నక్సలైట్లు వస్తుంటారు. నక్సలైట్లు వస్తున్నారని పోలీసులు వస్తుంటారు. ఇద్దరు రావటం ఆ వూరు ప్రజలకు ఇష్టం లేదు. పోలీసులు నక్సలైట్ల మూలంగా ఆ పల్లె ఘోర నరకాన్ని అనుభవించింది. గత ఆరు సంవత్సరాలుగా ఆ వూరులో ఒక్క మగ పురుగు కనిపించదు. ఎక్కడికో పారిపోయారు. ఆ వూరులో ఇంచుమించు అన్ని కుటుంబాలు అటు పోలీసుల బెదిరింపులకు, నక్సలైట్ల బెదిరింపులకు దెబ్బతిన్న కుటుంబాలే. "నక్సలైట్లు వచ్చారా" అని పోలీసులు, "పోలీసులు వచ్చి ఏం చేసారని" నక్సలైట్లు ఆ వూరు ప్రజలను వేధించారు, బెదిరించారు. రెండు తుపాకీల మధ్య ఆ పల్లె స్మశానంగా తయారయ్యింది. ఈ ఆరు సంవత్సరాలుగా మగవారు గొల్లపల్లి విడిచి పారిపోయారు. అంత భయం.

ప్రభుత్వం-నక్సలైట్ల మధ్య చర్చల వాతావరణం ప్రారంభం కాగానే ఆ వూరులో కొంత మార్పు వచ్చింది. శాంతియుత వాతావరణం మొదలయ్యింది. గత నాలుగు నెలలుగా నక్సలైట్లు పోలీసులు ఎవరూ రావటం లేదు. బెదిరింపులు లేవు, తుపాకీ శబ్దాలు లేవు, అరెస్టులు, వీపుమోతలు, లాఠీదెబ్బలు ఏవీ లేవు. గొల్లపల్లి ప్రశాంతంగా వుంది.

వాతావరణం ప్రశాంతంగా వుందని మూడు సంవత్సరాల క్రితం ఇల్లు వూరు వదిలిపోయిన కనకయ్య మూడు నెలల క్రితం ఇంటికొచ్చాడు. "చర్చలు ఏమవుతాయోనని అందరిలాగా ఆయనకు భయం". చర్చలు ఫెయిలయితే మళ్ళీ గ్రామం స్మశానంగా తయారవుతుంది. చర్చలు ఫెయిలయితే మళ్ళీ పారిపోవాల్సి ఉంటుంది. అందుకే కనకయ్య భయం సన్నాహాలు.

నిజానికి కనకయ్యకు ఎవరితో ఏ సంబంధంలేదు. ఇల్లు, పని తప్ప వేరు తెలియదు. కమ్యూనిజం తెలియదు. రాజ్యాంగం తెలియదు. తెలియకున్నా వేధింపులు తప్పవు. రకరకాల కారణాలతో ఆ వూరిలోని ప్రజలను అటు నక్సలైట్లు ఇటు పోలీసులు వేధిస్తుంటారు. బాధపెడుతుంటారు. 'అన్నం పెట్టమని' నక్సలైట్లు తుపాకీతో బెదిరిస్తే 'ఎందుకు పెట్టావని' పోలీసులు తుపాకీతో బెదిరిస్తారు. ఇది వాతావరణం. ఇదంతా తమ కోసమేనని వాళ్ళు అనటం కనకయ్య వినటం చాలాసార్లు జరిగింది. ఆ లోతుల్లోకి కనకయ్య వెళ్ళలేదు. ఈ బాధ తప్పితే చాలు



తమ బతుకులు తాము బతికితే చాలు ఎవరు తమను బతికించాల్సిన అవసరం లేదు. ఎవరు తమను రక్షించాల్సిన అవసరం లేదు ఇది ఆయన ఆలోచన.

ఇది కనకయ్య ఒక్కడి బాధే కాదు. ఆ వూరులో అందరి బాధ. ఆ వూరు లాంటి వందల వూళ్ళ ప్రజల బాధ. అందుకే చర్చల సారాంశం కొరకు కనకయ్య నిద్ర పోకుండా చూస్తున్నాడు.

తండ్రి కనకయ్య బాధ, భయాన్ని చూచి స్కూల్ సెలవులలో ఇంటికొచ్చిన కదుకు కొంచెం విసుక్కున్నాడు. "ఇదేం భయం ఇంత భయమెందుకూ?" అనుకున్నాడు. ఐదు సంవత్సరాలుగా పట్నంలో చదువుతున్నాడు కనుక పల్లె భయం వాడికి అర్థం కాలేదు.

పది గంటల రాత్రి అయినా నిద్ర పోకుండా బీడీ కాలుస్తున్న తండ్రిని చూచి కొడుకు అన్నాడు "ఎందుకు భయం నాన్నా! మనకు నక్సలైట్లతో సంబంధం లేదుగా" అన్నాడు.

"లేకున్నా బెదిరిస్తారు" తాపీగా అన్నాడు.

"నాన్నా పోలీసులతో మనకు సంబంధం లేదు. పేచీ లేదు. వాళ్ళ మనుషులం కాదు, మననెందుకు బెదిరిస్తారు?"

"బెదిరిస్తారు, కొడతారు, తంతారు" విసుగ్గా అన్నాడు తండ్రి.

పదవ తరగతి చదువుతున్న కొడుకుకు ఏమీ అర్థం గాలేదు. తండ్రి భయానికి కారణం కనిపించలేదు. అరిచినట్టుగా అన్నాడు.

"మనం ఎందుకు భయపడాలి? తప్పు చేయనపుడు భయమెందుకూ? ఎదిరిద్దాం"

కొడుకు ఆవేశాన్ని చూచి తండ్రి చల్లబడలేదు. ఈ విషయంలో 'ఆవేశం' ఎంత ప్రమాదమో ఆయనకు తెల్సు. అయినా కొడుకు చెంప చెళ్ళుమనిపించాడు కనకయ్య. షాక్ తిన్నాడు కొడుకు.

"అటూ ఇటూ వాళ్ళిద్దరి వద్ద తుపాకులున్నాయి. మన దగ్గర ఏమీ లేవు. ఎదిరిస్తాడట, ఎదిరిస్తాడు. బీడీ కాలుస్తూ నెమ్మదిగా అన్నాడు కనకయ్య.

## భూమెందుకూ?

"ప్రభుత్వం-నక్సలైట్ల" మధ్య చర్చలు జరుగుతున్నాయిగా భూమి పంచుతారట. భూమిలేని వాళ్ళకు భూమి వస్తుంది. ఇంకేం!" అన్నాడు టీ తాగుతూ రామయ్య.

ఉదయం ఎనిమిది గంటల సమయం. ఎండ ముఖం మీద పడుతూ వుంది. 'గురజాడ పల్లె' అనే పల్లెలో ఒక చిన్న టీషాప్ ముందు పది మంది కూర్చుని మాట్లాడుకొంటున్నారు.

గురజాడ పల్లె ఒక చిన్న వూరు. రెండు వందలు దాటని ఇల్లు. నాల్గువందలు దాటని జనం. వూరుచుట్టూ పొలాలు, చెరువులు, వాగులు. ఈ మధ్య చెరువులలో, వాగులలో నీళ్ళు వుండటం లేదు. వర్షాలు లేవు. కరువు పరిస్థితులు అన్ని వూళ్ళలాగే అక్కడ మెజారిటీ రైతులు ఒక్క పూట కూడా కడుపునిండా తినటం లేదు. రైతు చుట్టూ అప్పులు నెలక్రితం ఒక రైతు అప్పుల బాధ పడలేక ఆత్మహత్య చేసుకొన్నాడు. వూరుచుట్టూ పొలాలన్నీ పేరేకాని సగం సాగుకు నోచుకోవటం లేదు.

గురజాడ పల్లెలో రెండు టీ కొట్టులున్నాయి. రామయ్య టీ తాగుతున్న టీ కొట్టు వూరు మధ్యలో వుంటుంది. ఉదయం లేవగానే పదిమంది అక్కడ చేరి టీ తాగుతూ మాట్లాడుకోవటం అలవాటు. ఇంటి విషయాలు, వూరు విషయాలు, రాజకీయాలు అన్నీ వారి మాటల్లో చోటు చేసుకొంటాయి. తెల్సి కొంత, తెలియక కొంత తమకు తోచింది మాట్లాడుకొంటారు. అందులో భాగంగానే రామయ్య చర్చల గుర్చి ఆ మాట అన్నాడు.


రామయ్య ఆ మాట అనగానే అక్కడే టీ తాగుతున్న భూమయ్య అన్నాడు. ఎదురుగా వున్న నర్సింలును చూస్తూ "ఇంకేం భూమి వంచితే మన నర్సింలుకు రెండు ఎకరాలో, మూడెకరాలో వస్తుంది" అన్నాడు. రామయ్యకు భూమి వుంది, భూమయ్యకు భూమి వుంది, నర్సింలుకు లేదు. వెంటనే నర్సింలు అన్నాడు.

"ఎందుకు భూమి నాకు? మీలాగా అప్పులపాలు కావటానికా? ఆత్మహత్య చేసుకోవటానికా?"

## ఊయల పాపైనపుడు

ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి 'చర్చలు' ప్రారంభం కాగానే 'వాతావరణం ఎటో వుందని- ఇదే సమయంలో అనుకూలంగా పాచిక విసరాలని ఎం.ఎల్.ఎ. రమణారెడ్డి వీరేశలింగంపేట సర్పంచు ఇంటికి ఒక రాత్రి వెళ్ళాడు. సర్పంచు పేరు దినేశ్‌రెడ్డి. చెప్పా పెట్టకుండా వచ్చిన ఎం.ఎల్.ఏ.రమణారెడ్డిని చూచి ఆశ్చర్యపోయాడు. రాత్రి పది గంటలు దాటింది. వీరేశలింగం పేట వూరు మొదట్లో వున్న సర్పంచు దినేశ్‌రెడ్డి ఇల్లు విద్యుత్ దీపాలతో కళకళలాడుతూ వుంది. పెద్ద భవంతి అది. వీరేశలింగపేట రమణారెడ్డి ఎం.ఎల్.ఎ. పరిధిలోకి వస్తుంది. ఆయన పరిధిలో ఆ వూరు అతిపెద్ద గ్రామం. ఆయన ఇపుడు సర్పంచు. కానీ అంతకుముందు ఆ వూరు దొర. తరతరాల భూస్వామ్య దొరతనం వారిది.

ఎం.ఎల్.ఏ. రమణారెడ్డి సర్పంచు దినేశ్‌రెడ్డి ఒకే పార్టీవాళ్ళు. ముఖ్యంగా అధికార పార్టీవాళ్ళు. ఈ రెండూ కొంచెం దూరం బంధానికి సంబంధానికి గుర్తు కావచ్చు కానీ- ఒక మాటలో వాళ్ళు ఆత్మీయులు. ప్రభుత్వ సొమ్మును పంచుకోవటంలో ప్రజల కష్టాన్ని జేబులో నింపుకోవటంలో ఎప్పుడూ పోటీపడరు. కల్సి వంచుకొంటారు.



కల్సి ఏదైనా అనుభవిస్తారు. కల్సి తింటారు.

ప్రభుత్వం నక్సలైట్ల చర్చల సరళి చూచి భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని కల్సి పంచుకోవాలని, కల్సి అనుభవించాలని ఎం.ఎల్.ఏ. రమణారెడ్డి సర్పంచు దినేశ్‌రెడ్డి ఇంటికొచ్చాడు.


రాత్రి పదిగంటల సమయాన 'టీ'లు ఏం బాగుంటాయి రాజకీయ నాయకులకు! దినేశ్‌రెడ్డి ఫ్రిజ్ నుండి ఫారెన్ విస్కీ బాటిల్, ఐస్ ముక్కలు, మినరల్ వాటర్ బాటిల్ తీసి టేబుల్‌పైన పెట్టాడు. గదినిండా మెర్క్యూరీ బల్బుల వెలుగు. టి.విలో స్లోపైజన్ సంగీతం.

తాను వచ్చిన పని ప్రారంభించాడు ఎం.ఎల్.ఏ. "దినేశ్! ఈ వూరు సర్పంచువి నీవు. పెద్ద ధనవంతునివి, నాకు తోడూ, నీడవు నీవు. ఈ వూరు చుట్టుపక్కల ఈ ప్రాంతంలో చెరకు బాగా పండుతుంది".

విస్కీ గొంతులో పోసుకొని సిగరెట్టు అంటించి మళ్ళీ ప్రారంభించాడు.

"మనం ఇద్దరమూ కల్సి ఈ ప్రాంతం రైతుల కొరకు ఈ ఊరు పక్కనున్న భూములలో పెద్ద షుగర్ ఫ్యాక్టరీ నిర్మిద్దాం".

ఆశ్చర్యపోయాడు దినేశ్‌రెడ్డి. ఎం.ఎల్.ఏ.కు ఎదురు మాట్లాడినా, ప్రశ్నించినా కోపమే. నిశ్శబ్దంగా వూరుకున్నాడు.



"నీది సగం వాట, నాది సగం వాటా".

కృతజ్ఞతగా ఎం.ఎల్.ఏ. వంక చూచాడు దినేశ్‌రెడ్డి.

"దినేశ్! ప్రభుత్వానికి నక్సలైట్ల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. చర్చల ప్రభావం ఎలా వుంటుందో ఇప్పుడే చెప్పలేం కానీ మిగులుభూమి పంపకం జరిగిపోతుంది ఇది ఖాయం".

"ప్రభుత్వం- నక్సలైట్ల మధ్య మిగులు భూమి గూర్చి ఓ ఒప్పందం కుదిరిన తర్వాత ఇది సాధ్యం కాదు. మనకు భూమి మిగలదు. మీ వూరు చుట్టు పక్కల వందల ఎకరాలు ప్రభుత్వ భూములున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు వందల ఎకరాలు మనం పెట్టబోయే షుగర్ ఫ్యాక్టరీ కొరకు అతి తక్కువ మామూలు ధరకు పంచాయితీలో తీర్మానం చేయించు. ప్రభుత్వం మనదే కనుక ఆమోదముద్ర వేయిస్తాను. భూమి రెండు వందల ఎకరాలు మనదవుతుంది.

"రేపు పొద్దున భవిష్యత్తులో నక్సలైట్లు" సర్పంచు సందేహం వ్యక్తీకరించాడు.

"మిగులు భూములు పంచుతారు. ఒకరి పేరుతో రిజిస్ట్రేషన్ అయిన భూమి ఎలా పంచుతారు? ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధం మన దేశంలో".

## ఆయుధం

శ్రీశ్రీ పల్లెలో 'సిరిసిరిమువ్వల చిన్నలచ్మవ్వ' చిన్నబోయి కూర్చుంది. ఆమెకు భయంగా వుంది, ఆందోళనగా వుంది. రాత్రి పదకొండు గంటలు. నిద్ర రాక ఇంటిముందు అరుగుమీదికొచ్చి ఒక్కతే కూర్చుంది.

శ్రీశ్రీ పల్లె నిశ్శబ్దంగా వుంది. అక్కడక్కడా కుక్కలు అరుస్తున్నాయి. వీధిలైట్లు వెలగటం లేదు. గ్రామం చీకట్లో వుంది. అందరూ నిద్రపోయినట్లున్నారు. నిద్రపోయారని కచ్చితంగా చెప్పలేం. అరగంట క్రితం బాగా తాగిన జనం వీధుల్లో అరవటం, అల్లరి చేసుకోవటం జరిగింది. ఇది ఆ వూరుకు మామూలే!

'సిరిసిరి మువ్వల చిన్నలచ్మవ్వ' వయస్సు నలుపది దాటదు. అయితే ఆమె ఆకర్షణీయమైన అందమైన ముఖం ముప్పది దాటనట్టుగా కనిపిస్తుంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. మగడు దుబాయ్‌లో వుంటున్నాడు. ఆమె కొంత రాజకీయ పరిజ్ఞానం గల వ్యక్తి. చాలా ధైర్యం గల వ్యక్తి. కొంతకాలం ఆమె ఆ వూరుకు సర్పంచుగా పనిచేసారు.

ప్రభుత్వం-నక్సలైట్ల మధ్య చర్చల వాతావరణం ప్రారంభమయిన తర్వాత శ్రీశ్రీ పల్లెలో వచ్చిన మార్పు సిరిసిరిమువ్వల చిన్నలచ్మవ్వలో ఎంతో భయాన్ని కల్పించింది. ఎంతో ఆందోళనకు గురి చేసింది. చర్చల వాతావరణం ప్రారంభం కాగానే ఐదు సంవత్సరాల నుండి వూరిలో కనిపించనివారు వూరునుండి పారిపోయినవారు కనిపించటం ప్రారంభించారు. జులాయిగా తిరిగే రౌడీలు, పోలీసు మనుషులుగా పడినవారు, మిలిటెంట్లుగా చెప్పుకొని గ్రామ ప్రజలను వేధించినవారు, పాత నక్సలైట్లు వీధుల్లో కనిపించసాగారు. కనిపించటం కాదు విర్రవీగి తిరుగుతున్నారు. మళ్ళీ ప్రజలను బెదిరిస్తున్నారు.

ఇటువంటి వారి బాధ పడలేకే సర్పంచు పదవికి ఆనాడు రాజీనామా చేసింది. తనను పోలీసు ఇన్‌ఫార్మర్లు వేధించారు. మిలిటెంట్లు వేధించారు. అర్ధ రాత్రి వచ్చి తలుపులు కొట్టేవారు. డబ్బులిమ్మని బెదిరించేవారు. రాత్రి తలుపులు కొట్టి ఇంట్లోనే పడుకుంటామనేవారు. కొందరైతే తనతో పడుకొమ్మని లేకపోతే పోలీసులతో చెప్పి అరెస్టు చేపిస్తామని, అన్నలతో చెప్పి కాళ్ళు, చేతులు విరగ్గొట్టిపిస్తామని బెదిరించేవారు.

ఐదు సంవత్సరాలుగా వాతావరణంలో మార్పు వచ్చింది. అటూ ఇటూ వచ్చిన ఒత్తిడి మూలంగా శ్రీశ్రీ పల్లెలో ఇన్‌ఫార్మర్లు, గుండాలు, మిలిటెంట్లు ఎక్కడికో పారిపోయారు.

చర్చల వాతావరణం రాగానే మళ్ళీ కనిపించసాగారు.

శ్రీశ్రీపల్లె అడవికి దగ్గరగా వున్న ఒక పల్లె. అన్నల పల్లె అని పోలీసులంటారు. అన్నల పేరుతో ప్రజలను వేధిస్తున్నారని కొందరంటుంటారు. నిజమేమిటో కానీ అటూ ఇటూ మద్దతు వున్నవారు ప్రజలను వేధించుకతిన్న మాట నిజం.

ఆ వాతావరణం మళ్ళీ వచ్చిందని, పోలీసుకు సంబంధించినవారు, లేదా మిలిటెంట్లు, మాజీ నక్సలైట్లు, రౌడీలు మళ్ళీ తనను వేధిస్తారని 'సిరిసిరిమువ్వ చిన్నలచ్మవ్వ' బాధపడసాగింది. ఏమి చేయాలా అని ఆలోచించసాగింది.

ఆ రాత్రి ఆలోచించగా ఆలోచించగా గబుక్కున ఒక ఆలోచన వచ్చింది. ప్రభుత్వం ఎంత చెప్పినా నక్సలైట్లు ఆయుధాలు వదలటం లేదెందుకూ?

ఆయుధంలో అంత బలముందా? ఆయుధం చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమించాయి.

తనకు తుపాకీ వుంటే బాగున్ను! తుపాకీ చుట్టూ ఆమె ఆలోచనలు పరిభ్రమించాయి. తుపాకీ దొరుకదు. ఎలా? ఈ మిలిటెంట్ల నుండి, మాజీ నక్సలైట్ల నుండి పోలీసుల అండ వున్న రౌడీల నుండి బతుకాలంటే ఆమె ఆ రాత్రి అరుగుమీది నుండి ఇంటిలోనికి నడిచింది. ఇంట్లో ఒక గోడమీద దాచిన 'వేట కొడవలి'ని తీసి ఆ రాత్రి బాగా నూరసాగింది.

'ఈ వేట కొడవలి చాలు ఎవరు వచ్చినా నరకటానికి' అనుకుంది.